# స్త్రీ జీవితంలో ప్రేరణలు ★

శ్రీ కొడవటిగంటి
కుటుంబరావుగారు

ఆత్మరక్షణలూ, అర్థమూ, కామమూ, మాతృత్వమూ— ఈ సహజ ప్రేరణలు జీవిత చైతన్యానికి మూలకారణాలని కొందరు శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు. వీటిలో దేనికి ఏవిధమైన అంతరాయాలు కలిగినా అంతలెక్క జీవితం దుఃఖ భాజన మవుతుంది.

మనిషిలో ఉండే ప్రేరణలు "పచ్చిగా" లేవు. అవి జ్ఞానానుభవాల ద్వారా సంస్కృతి పొంది ఉన్నాయి. అందుచేత ఆత్మరక్షణ కేవలమూ ప్రాణరక్షణగా కాక సాంఘిక హక్కులరూపంలో మనచైతన్యాన్ని ఆవేశిస్తుంది. ఆ విధంగానే అర్థప్రేరణ కేవలమూ తిండికోసమే ఎగబడక నగలూ, దుస్తులూ, ఇతర ఉపకరణాల కోసం పాకులాడుతుంది. కామం ప్రేమకోసం దేవులాడుతుంది. మాతృత్వం సేవారూపం పొందుతుంది.

"పచ్చి" ప్రేరణలతో కూడుకున్న చైతన్యంగల క్షుద్ర జంతువులు ఆ ప్రేరణలమధ్య కలిగే సంఘర్షణకు తట్టుకో గలవు. కుక్కముందు ఆహారంపెట్టి పక్కనే మనం కర్ర పట్టుకుని నిలబడితే, ఆహారంకోసం దెబ్బలు సహించాలో, ఆత్మరక్షణకోసం ఆహారం విసర్జించాలో తేల్చుకుని ఆ నిర్ణయం ప్రకారం నడుచుకో గలుగుతుంది. కాని సంస్కారంతో కూడుకున్న జీవితం పునాదిగా ఉన్న "పచ్చి" ప్రేరణల మధ్య కలిగే సంఘర్షణకి నిలబడలేదు. అది చాలా ప్రమాదాలకి దారి తీస్తుంది.

ఈ విషయాలు మనసులో ఉంచుకుని ఆడదాని జీవితం గురించి ఆలోచించి నట్టయితే "ఆడబ్రతుకే మధురం" అని ఎవరూ గానం చెయ్యరు—ఆడజాతిని వంచించటానికి తప్ప.

మొదట ఆడదాని ఆత్మరక్షణ ప్రేరణ తీసుకుందాం. ఆచారంగా గాని, చట్టరూపంగా గాని, ఆడదానికాస్టే హక్కులు కనిపించవు. ఈనాడు కూడా అత్తవారింట హింసపడే ఆడదానికి రక్షణలేదు. ఇష్టంలేని భర్తని విడిచిన ఆడదాన్ని సంఘం భర్తకు తిరిగి వప్పగిస్తుంది, లేదా సీరసించి ఊరుకుంటుంది. స్త్రీ రక్షణ సమస్యదగ్గిర సంఘం సాంఘికచైతన్యం లేనట్లే ప్రవర్తిస్తుంది!

ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే సంస్కారం పొందిన జీవిత చైతన్యాన్ని సంఘంనించి వేరుచెయ్యటానికి లేదు. నిర్మానుష్య ప్రదేశంలో ఒక్క ప్రాణి ఉండి "పచ్చి" ప్రేరణల పునాదిమీద సంస్కారంతో కూడిన ప్రవర్తన అవలంబించటమంటూ జరగదు. సంఘంగా ఉన్నప్పుడుకూడా పచ్చిప్రేరణలచేత ప్రేరేపించబడేవి, జ్ఞానంలేని మృగాలు. అవికూడా ఎప్పుడైనా ఉమ్మడిగా ఆత్మరక్షణ చేసుకోవటం జరుగుతుంది. కాని మొత్తంమీద ఆడదాని ఆత్మరక్షణకి సంఘం తోడురావటం ఆచారంగాలేదు. పిల్లని ఓ అయ్యచేతులో పెట్టే సమయంలో బావురుమని ఏడిచి తల్లిదండ్రులు లీ అసమర్థతే పైకి ప్రకటిస్తారు. భర్త తన వస్తువాహనాలని రక్షించుకొనే విధంగానే భార్యనుకూడా రక్షించుకోవచ్చు. కాని భార్య భర్త దౌర్జన్యంనుంచి తన శరరాన్ని గాని, అభిమానాన్ని గాని, రక్షించుకునే సాధనంలేదు. భర్తలందరూ చెడ్డవాళ్ళని కాదు. ఆ మాటకువస్తే జంతువులు కూడా అనుక్షణమూ ప్రాణాపాయ స్థితిలో ఉండవు. కాని హానికలిగే పరిస్థితుల్లో ఆడదాని కాత్మరక్షణ సాధనం లేకపోవటం గమనించదగ్గ విషయం. అందుచేత సంఘంలో బతికి ఉండటం అలవాటయిన స్త్రీ తన ఆత్మరక్షణ ప్రేరణని అడగ దొక్కకోవలసి వస్తుంది.

రెండవది అర్థప్రేరణ. తమ పిల్లలకి అర్థలోపం కలగకుండా ఉండగలందులకు తల్లిదండ్రులు సాధ్యమైనంతవరకు ఇంత తినటానికున్న మొగుణ్ణి తీసుకురావాలని చూస్తారు. కాని నూటికి ఎనభైమందికి తినతిండిలేని దేశంలో ఈ ప్రయత్నాలు ఎంతవరకు సఫలమయేదీ ఊహించ వచ్చును. భాగ్యవంతుణ్ణి పెళ్లాడిన ఆడదాని క్కూడా అర్థలోపం ఉండే అవకాశం ఉంది. అర్థకాంక్ష అనేది అవకాశాన్ని బట్టి మారుతూ ఉంటుంది. గనక దరిద్రుడి భార్యకు ఆహార



http://www.maganti.org/

కాంక్ష తీరనట్లే, భాగ్యవంతుడి భార్యకి నగలకాంక్ష తీరక పోయ్యే అవకాశం ఉంది. అదీకాక ఆడదానిలో అర్థకాంక్ష తెచ్చిపెట్టగల చైతన్యం ఆశే కనిపించదు—భర్తమీద లేని ప్రేమ నటించటం తప్ప. అర్థప్రేరణలో విశ్వాసం లేని వాళ్ళూ, పోగొట్టుకొన్నవాళ్లూ "భార్య" (భరించబడేది) కావటం ఆడదానికి "సుఖం" అనే భ్రాంతిలో పడొచ్చు. కాని అందువల్ల చైతన్యాన్ని పురికొల్పే ప్రేరణల్లో ఒకటి అణిగిపోతున్నదని గ్రహించటం అవసరం.

మూడవది కామప్రేరణ. ఇక్కడకూడా అడదాన్ని చూసి అసూయ పడవలసిన అవసరం కనిపించదు. మన సంఘంలో ఆడదానికి "ప్రేమించే" శక్తి ఉందనుకోవటానికి అధారం ఏమీలేదు—ప్రణయ కథకులు క్షమిస్తే. మొదటి సంగతిమనం పద్నాలుగేళ్ళకే ఆడపిల్లలకి మొగుళ్ళని అంటగట్టేస్తున్నాం. "కామం" ఒక ప్రేరణగా ఆడదానిలో తల ఎత్తకపూర్వమే దాని సంతృప్తికి మార్గం ఏర్పాటు చేస్తున్నాం. అందుచేత ఈ ప్రేరణ ఆడదానిలో ఒక చైతన్యం కల్పించి దానికి సంస్కారం అంటగట్టే అవకాశంలేదు. "ప్రేమ" ద్వారా కామ సంతృప్తి తప్పనిసరి అయినప్పుడుగాని ఆ ప్రేరణ ఒక చైతన్యాన్ని తెచ్చిపెట్టదు. ఆ చైతన్యానికి సంస్కారం అంటే అవకాశం రాదు. సంకెళ్ళతో కట్టుకున్న భర్తని ప్రేమచేత ఆకర్షించటానికి ఏ ఆడది ఎందుకు ప్రయత్నించవలసి వస్తుంది?

అఖరు ప్రేరణ మాతృప్రేరణ. ఇక్కడకూడా ఈప్రేరణ ఏవిధంగా అణగదొక్క బడేదీ మనం నిత్యమూ చూస్తూనే ఉన్నాం. పిల్లల ప్రాణానికి తనప్రాణం అడ్డువేసే అవకాశం ఆడదానికి రానేరాదు. వాళ్ళ ఆరోగ్యానికి గాని, అభ్యుదయానికిగాని జీవశక్తి ధారపోసే అవకాశం ఆడదానికి లేదు. పిల్లల్ని పెంచటం గురించిగానీ, ఆరోగ్య విధానాలను గురించిగాని తెలిసిన తల్లులు—శిక్షణ పొందిన ఆడవాళ్ళు మన సంఘంలో లేరు. ఏ పదేళ్ళో వచ్చేసరికి పిల్లలే తల్లికన్న ఎక్కువ "చదివిన" వాళ్ళయి కూచుంటారు. ఆపైన తల్లియొక్క మాతృత్వం పిల్లల నిరసనకి గురికావటం తప్ప, మరేమీ లేదు.

సంఘంలో కొన్ని హక్కులుండి, వాటిని సంరక్షించుకునేటందుకు పోరాడగలిగి, తనకు కావలసిన ద్రవ్యాలను సంపాదించటానికి ఉద్యమించగలిగి, తాను కోరినభర్త ప్రేమ సంపాదించటానికి పాటుపడగలిగి, తనపిల్లల ఆరోగ్యాభివృద్ధులకొరకు సర్వశక్తులూ ధారపోయగలిగిన స్త్రీది సమగ్ర జీవితమైతే మన ఆడవాళ్లు జీవించటం లేదని వేరే చెప్ప నవసరం లేదు.

స్త్రీ జీవితాన్ని సంస్కరించటానికి పూనుకునేవాళ్లు చాలామంది అనుకోకుండానే ఒక గోతిలో పడతారు: వాళ్ల ప్రత్యేక ప్రేరణలు ఉద్ధరించటానికి ప్రయత్నిస్తారు. స్త్రీ జీవితంలో కామప్రేరణ చాలా అణగదొక్కబడి ఉండటం గమనించిన ఒక ప్రసిద్ధ రచయిత తెలుగుదేశంలో ఉన్న స్త్రీలనందర్నీ రంకుతనం చెయ్యమని హెచ్చరించాడు. ప్రేమించి పెళ్లాడే అవకాశం దొరికితే ఆడవాళ్ల జీవితం చాలావరకు బాగుపడుతుందనే అభిప్రాయం కల వాళ్లు చాలామంది ఉన్నారు. స్త్రీలకి వారసత్వపు హక్కు ఉద్యోగాలు చేసుకునే అవకాశము ఉంటేవాళ్ల కష్టాలు చాలాభాగం ఈడేరుతాయనే వాళ్లింకా ఎక్కువమంది ఉన్నారు. కాని ఒక్క విషయం ఎక్కువమంది గమనించినట్టు కనబడదు. అదేమిటంటే, అన్ని ప్రేరణల్లోకీ ప్రబలమైనది ఆత్మరక్షణ ప్రేరణ. ఇది తెచ్చిపెట్టే చైతన్యం పోరాటం. స్త్రీని పోరాటానికి ప్రోత్సహించిన సంస్కర్తలు కనిపించరు.

పోరాటాన్ని విసర్జించి అర్థప్రేరణకూ కామప్రేరణకూ లొంగిపోయిన వాళ్లని సంఘం తక్కువచూపు చూడటం గమనిస్తున్నాం. కాని సంఘ సంస్కరణకి నడుముకట్టిన స్త్రీలందరూ పోరాటాన్ని అవలంబించినవాళ్లే. క్రియకు వాళ్లనే సంఘం హర్షిస్తున్నది. మిగతా ప్రేరణలను సంస్కారయుతంగా తృప్తిపరుచుకునే హక్కు పోరాటంద్వారా తప్పరాదు.

పోరాటాన్నికూడా పశుశక్తిగా పరిగణించే మేధావులు లేకపోలేదు. కాని ఈ పోరాటం పశుశక్తులమీదనే అని గ్రహిస్తే దాని విలువ తెలుస్తుంది. సంస్కారంతోకూడిన సాంఘిక హక్కులకోసం పోరాడకుండా "పచ్చి" ప్రేరణ

(తరువాయి 6-వ పేజీ)



http://www.maganti.org/

# రావు కమిటీ ఆంధ్ర రాష్ట్రానికి కూడా రావాలి

విశాఖపట్నంలో యీనెల 14 వ తేదీని ఆకెళ్ళ సూర్యనారాయణ మహిళా భవనంలో పురస్త్రీల సమావేశం జరిగింది. శ్రీమతి బులుసు సూరమ్మగారు సభ కధ్యక్షత వహించారు. శ్రీ కె. సత్యనారాయణ యం. ఏ., బి. యల్ గారు హిందూ లా లో రావుకమిటీవారు ఉపపాదించిన సవరణలనుగూర్చి విపులంగా ఉపన్యసించిన పిదప పలువురు స్త్రీలు ప్రస్తుతం అమలులోవున్న హిందూ లా వలన స్త్రీసంఘానికి సంభవిస్తోన్న అన్యాయములను గూర్చి చర్చించారు. స్త్రీలోకానికి సభ్యత చేకూర్చడానికి యిష్టంలేని సనాతనులు రావు కమిటీ ప్రతిపాదనల వ్యతిరేకంగా చేస్తూన్న దుష్ప్రచారాన్ని ఖండించారు. రావు కమిటీవారు ఆంధ్ర రాష్ట్రంలో కూడా ప్రచారం చెయ్యాలనీ, వివిధ నగరాల్లో మహిళాసేవ చేస్తున్న సంస్థలయొక్క అభిప్రాయాలని తెలుసుకోవాలనీ తీర్మానించారు.

హిందూ లా సవరణల గూర్చి యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింప బడ్డాయి.

1. అనేకవందల సంవత్సరాలనుండీ పరిస్థితుల కనుగుణ్యంగా మార్పు చేయకుండా వెనుకబడియున్న హిందూ లా విధానాన్ని మార్పు చేయుటకై నియమించబడిన బి. యన్. రావు కమిటీయొక్క కృషిని అభినందిస్తూన్నారు.

వారసత్వం—తండ్రి బ్రతికి ఉన్నప్పుడే ఆస్తినిపంచుకునే హక్కు కుమాళ్ళకు ఇప్పుడు ఉన్నది. చిత్తుచట్టంలో ఇది రద్దు చేయబడింది. తల్లిదండ్రులు ఏదియు వ్రాయకుండా చనిపోయినప్పడే పిల్లలు పంచుకొన వచ్చును. ఇది వ్యక్తి స్వేచ్ఛకు అభివృద్ధికి హానికరం. కనుక తల్లిదండ్రులు బ్రతికి ఉండగానే కుమార్తెలు, కుమాళ్ళు, తల్లి, తండ్రి, అందరూ సమ భాగాలు పంచుకోవాలి.

2. ఏకపత్నీ వివాహాన్ని శాసన రూపేణా నిర్ణయిస్తున్న చట్టాన్ని ఈ సభవారు అభినందించు చున్నారు.

3. సంస్కార, రిజిస్ట్రేషన్ వివాహముల వయస్సు 16 సం॥ నిర్ణయించాలి.

4. వివాహ సమయమున పిచ్చి లేక బుద్ధిశూన్యత మొ॥ జబ్బులున్నట్లు బయల్పడిన అట్టి వివాహము చట్టరూపేణ రద్దు కావలెను.

మనోవర్తి—(1) భర్త లేక తదితరులు (అత్త మొదలైనవారు) ఎవరు క్రూరంగా చూచినప్పటికీ మనోవర్తి హక్కు వుండాలి.

(2) చనిపోయిన భర్త భాగాన్ని భార్య సమిష్టి కుటుంబంనుండి పంచుకొనే హక్కును చిత్తుచట్టం రద్దుచేసింది. మనోవర్తి హక్కుమాత్రం కల్పించుతోంది. పై హక్కును పునరుద్ధరించాలి.

(3) మనోవర్తి తీసుకొనే వితంతువు కుటుంబం యొక్క అదుపులోనే వుండాలని, లేకపోతే మనోవర్తి కోల్పోతుందని చిత్తుచట్టంలో [illegible]. ఇది అన్యాయం. ఆమె తన అప్తులైన వారిదగ్గర వుం[illegible] అవకాశం కలిగించాలి.

దత్తత—దత్తత [illegible]కొనుటకు భార్యా భర్తలు ఇద్దరి అనుమతి ఉండాలి దత్తత చేసుకొను స్త్రీవయస్సు 15 సం॥ గాక 18 సం॥ నిర్ణయించావి.

---

(5-వ పేజీ తరువాయి)

లకు లోబడి శరీరం అమ్ముకునే వాళ్లనీ, కామ సంతృప్తి చేసుకునే వాళ్లనీ అరికట్టలేని సంఘం, ఈ ప్రేరణలని సంస్కారయుతంగా, సంపాదించుకోవటానికీ ప్రేమించటానికీ హక్కురూపేణా తృప్తిపరచుకోవటానికి ఆమోదించదు. పశుప్రేరణలను ప్రతిఘటించలేక సంస్కారానికి అంతరాయంగా నిలబడగలది పశుశక్తికాక మరొకటికాదు. దాన్ని అతిక్రమించటానికి పోరాటంకన్న మరొకసాధన లేదు. మన సంఘంలో స్త్రీ జీవితాన్ని ఈ స్థితికి తెచ్చింది కూడా ఈ పశుశక్తులే. ఆ కారణంచేత స్త్రీ జాతియొక్క అభ్యుదయం కోరినవారు క్షుద్ర చట్టాలతో సంతృప్తిపడి ఊరుకోరాదు. కేవల రజస్వలానంతర వివాహాలూ, కొద్దిపాటి చదువులూ స్త్రీ జీవితాన్ని సమగ్రం చెయ్యలేవు. సహజ ప్రేరణలను తృప్తిపరుచుకోవటంలో అత్యుత్తమ సంస్కారాన్ని వినియోగపరుచుకునే హక్కు ప్రతి మానవ ప్రాణికీ ఉన్నది. అది సంఘంనుంచి ఆడది పోరాడి పుచ్చుకోవలసిన మొదటి హక్కు.



ఆంధ్రమహిళ పత్రిక సంపుటి 1 సంచిక 15
1944

http://www.maganti.org/

Source: Press Academy Website, Andhra Mahila, Dec 1944

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan